
ఆంధ్రజ్యోతి
andhrajyothy.com
గురువారం ఉష్ణోగ్రత గరిష్ఠం 33.3 । కనిష్ఠం 19.9
ఆదిలాబాద్ జిల్లా వార్తలు
5
శుక్రవారం 23 ఫిబ్రవరి 2024



రైతులపై పోలీసుల దాడి అమానుషం

• సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ

ఆదిలాబాద్ అర్బన్, ఫిబ్రవరి 22: రైతుల పోలీసుల దాడి అమానుష మని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ ఆదిలాబాద్ జిల్లా కార్యదర్శి వెంకట్ నారాయణ అన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పంజాబ్ రాష్ట్రానికి చెందిన బటిండా జిల్లాలోని బాలన్‌గ్రామానికి చెందిన 24ఏళ్ల యువకుడు శుభకరణ్‌సింగ్‌ను పోలీసులు కాల్చి చంపడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. బాధ్యులైన పోలీసులను వెంటనే హత్యానేరం కింద అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.





- జిల్లాలో 71,861 ఎకరాల్లో చేతికి వచ్చిన శనగ పంట
- ఈసారి క్వింటాకు మద్దతు ధర రూ.5440 మాత్రమే..
- అందుబాటులో లేని శనగ కొనుగోలు కేంద్రాలు
- దళారుల పాలవుతున్న శనగ
- చోద్యం చూస్తున్న అధికార యంత్రాంగం

సన్నగిల్లుతున్న ఆశలు!



శనగను కోస్తున్న హార్వెస్టర్

ఆదిలాబాద్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రధానంగా సాగయ్యే పత్తి, సోయా, కంది పంటలతో పాటు రబీలో శనగపంట కూడా అధికంగానే సాగవుతోంది. జిల్లాలో ఈసారి 71,861 ఎకరాల్లో పంట సాగైంది. వాతావరణ పరిస్థితులు అనుకూలించడంతో దిగుబడులు ఆశించిన స్థాయిలోనే వస్తున్నాయి. దీంతో 3లక్షల 50వేల క్వింటాళ్ల దిగుబడులు వస్తాయని అధికారులు అంచనా వేస్తున్నారు. జిల్లాలో విస్తారంగా ఉన్న నల్లరేగడి భూములకు అనువైన పంట కావడంతోపాటు అడపదడపగా అందించే నీటితడులతో శనగ పంట చేతికి వస్తోంది. దీంతో రైతులు ఎక్కువగా శనగ పంటను సాగు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఎకరాకు 5 నుంచి 7 క్వింటాళ్ల దిగుబడులు వస్తున్నాయని రైతులు చెబుతున్నారు. కానీ ఆశించిన స్థాయిలో ధర లేకపోవడంతో ఏ మాత్రం గిట్టుబాటు కావడం లేదంటున్నారు. ఇప్పటికే పత్తి, సోయా, కంది పంటలతో నష్టాల పాలైన అన్నదాతలకు శనగ పంటపై పెట్టుకున్న ఆశలు ఆవిరవుతున్నాయి. ఈయేడు క్వింటాకు ప్రభుత్వం రూ.5440 మద్ధతు ధర ను కల్పించింది. కానీ బయటమార్కెట్‌లో ఎక్కువ ధర ఉన్నా దళారులు, ప్రైవేట్ వ్యాపారుల దోపిడీతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. అయితే కనీసం క్వింటాకు రూ.8వేల నుంచి10వేల వరకు మద్దతు ధర ఉంటేనే గిట్టుబాటు అవుతుందని రైతులు చెబుతున్నారు. కనీసం పెట్టిన పెట్టుబడులు కూడా చేతికి వచ్చే పరిస్థితులు లేవని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతవారం రోజుల క్రితమే పంట చేతికి రావడంతో నూర్పిడి చేసి అమ్మేందుకు సిద్ధంగా ఉంచిన కొనుగోలు కేంద్రాల ఏర్పాటు ఆలస్యం కావడంతో ఎదురుచూపులు తప్పడం లేదు.

ప్రతీయేడు ఆలస్యమే..

గత అనుభవాలను దృష్టిలో పెట్టుకొని అధికారులు ముందస్తుగా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాల్సి ఉండగా ఇప్పటి వరకు ఆ దిశగా చర్యలు మొదలు పెట్టినట్లు కనిపించడమే లేదు. ప్రతీయేడు ఆలస్యం గా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడంతో దళారులకు మేలు జరుగుతుందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. వారం రోజుల నుంచి జిల్లాలో శనగ పంట కోతలు ఊపందుకోవడంతో రైతులు శనగలను నూర్పిడి చేసి శుద్ధిచేసే పనుల్లో నిమగ్నమయ్యారు. కొందరు రైతులు ఇప్పటికే శుద్ధి చేసిన శనగలను అత్యవసరాల పేరిట అందుబాటులో ఉన్న దళారులకు అమ్మేసుకుంటున్నారు. కానీ ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలనుఎక్కడా ప్రారంభించనే లేదు. ముందస్తుగా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి ఉంటే పంటను విక్రయించేందుకు అవకాశం ఉంటుంది. పంట సాగుచేసే సమయంలో రూ.8వేల ధర పలకడంతో అన్న దాతలు ఆశపడి అధిక సాగుకు శ్రీకారం చుట్టారు. కానీ ప్రస్తుతం క్వింటా ధర సగానికి సగం పడిపోవడంతో దిక్కులు చూస్తున్నారు. చేతికి వచ్చిన కాస్త పంటను పెట్టుబడుల ఇబ్బందులతో రై తులు ఆదరాబాదరగా అమ్మే సుకుంటున్నారు.

అరకొరగానే మద్దతు ధర

శనగ పంటకు ప్రభుత్వం ప్రతియేడు అరకొరగానే మద్ధతు ధరను పెంచడంతో గిట్టుబాటు కావడం లేదని రైతులు చెబుతున్నారు. గత నాలుగేళ్లుగా పెరిగిన మద్ధతు ధరలను పరిశీలిస్తే 2020 - 21లో రూ.5100 కాగా 2021-22లో రూ.5230, 2022-23లో రూ.5335, 2023-24లో రూ.5440 మద్ధతు ధరను ప్రభుత్వం నిర్ణయించింది. ప్రతిసారి కేవలం 200ల లోపే మద్దతు ధరపెరిగింది. దీంతో తీవ్ర నష్టం వాటిల్లుతుందని రైతులు ఆవేదనకు గురవుతున్నారు. అయితే సగం సీజన్ ముగిసిన తర్వాత అధికారులు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడం అన్నదాతలకు ఏ మాత్రం ప్రయోజనం ఉండడం లేదు. ఈసారి కందుల కొనుగోళ్లను కూడా నామమాత్రంగానే చేపట్టారు. జిల్లాలోని జైనథ్, ఆదిలాబాద్, బోథ్, ఇచ్చోడ, బజార్‌హత్నూర్, తాంసి మండలాల్లో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయకపోవడంతో రైతులు దళారులను ఆశ్రయించాల్సి వస్తోంది. ప్రభుత్వం నుంచి ఆదేశాలు అందలేదని మార్కెట్ అధికారులు చెప్తున్నారు.

మద్దతు ధర సరిపోవడం లేదు..



• చాట్ల రమేష్ (రైతు, బజార్‌హత్నూర్ మండలం)

ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర ఏ మూలనా సరిపోవడం లేదు. వేలల్లో పెట్టుబడి పెరిగిపోతున్నా ప్రభుత్వం మాత్రం వందల్లోనే మద్దతు ఇస్తోంది. అరకొర మద్దతు ధరలతో ప్రయోజనం ఉండడం లేదు. ప్రైవేట్ వ్యాపారులకు విక్రయిస్తే నగదు, తేమ కోతల పేరిటా నిలువుదోపిడి చేస్తున్నారు. మద్దతు ధర లేక నష్ట పోవాల్సి వస్తుంది. రైతుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం మద్ధతు ధరనుకల్పించాలి.

ఆదేశాలు అందగానే కొనుగోళ్లు చేస్తాం



• శ్రీనివాస్ (మార్కెంటింగ్ ఏడీ, ఆదిలాబాద్)

ప్రభుత్వం నుంచి ఆదేశాలు అందగానే శనగ పంట కొనుగోళ్లను చేపడుతాం. ఈసారి కూడా శనగకు ప్రైవేట్‌లోనే ధర ఎక్కువ ఉంది. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు రైతులు రావడం కష్టమే. అయినా ప్రభుత్వ ఆదేశాల ప్రకారం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తాం. జిల్లా వ్యాప్తంగా 71వేల 861 ఎకరాలలో పంట సాగైంది. దీంతో 3లక్షల 50వేల క్వింటాళ్లకు పైగా దిగుబడులు వస్తాయని అంచనా.

సంక్షిప్త సమాచారం

జైనథ్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా బద్దం సురేష్‌రెడ్డి!

జైనథ్, ఫిబ్రవరి 22: ఆదిలాబాద్ నియోజక వర్గంలోని జైనథ్, బేల వ్యవసాయ మార్కెట్ మిటీ చైర్మన్‌గా బద్ధం సురేష్‌రెడ్డి నియమకానికి సర్వం సిద్ధమైంది. గత 1995 నుంచి కాంగ్రెస్ పార్టీ మాజీ మంత్రి చిల్కూరి రాంచంద్రారెడ్డి హయాంలో కాంగ్రెస్ పార్టీ క్రీయాశీలక కార్యకర్తగా పనిచేస్తూ వస్తున్నాడు. సాత్నాల ప్రాజెక్టు డైరెక్టర్‌గా జైనథ్ మండల ప్రజలకు సామాజికసేవను అందిస్తున్న ఆయన ఇటీవల కాంగ్రెస్ పార్టీ ఆదిలాబాద్ అసెంబ్లి ఇన్‌చార్జీ కంది శ్రీనివాస్‌రెడ్డి సమక్షంలో చేరి జైనథ్ గ్రామంతో పాటు జైనథ్ మండలంలో కంది శ్రీనివాస్ రెడ్డికి అత్యధికంగా ఓట్లు రావడానికి కృషిచేశారు. వ్యవసాయ బిడ్డగా నాకు జైనథ్ వ్యవసాయ మార్కెట్‌చైర్మన్‌గా నియమిస్తే మండల రైతులకు తగు న్యాయం చేస్తానని సురేష్‌రెడ్డి తెలిపారు.

బీజేపీలోకి బీఆర్ఎస్ వార్డు ప్రెసిడెంట్

ఆదిలాబాద్‌అర్బన్, ఫిబ్రవరి 22: పట్టణంలోని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయలశంకర్ నివాసంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో స్థానిక సుందరయ్యనగర్ బీఆర్ఎస్ వార్డు ప్రెసిడెంట్ గోరక్‌నాథ్ ఎమ్మెల్యే సమక్షంలో బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా ఆయనకు పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లాఅధ్యక్షుడు పతంగి బ్రహ్మానంద్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పది పరీక్షలపై అవగాహన

తలమడుగు, ఫిబ్రవరి 22: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు గురువారం ప్రముఖ పోటీ పరీక్షల నిపుణులు అల్లం సాయికృష్ణ, రమణగౌడ్ గొడిసెలలు పదో తరగతి పరీక్షలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు పదోతరగతి పరీక్షలపై విద్యార్థులకు ఉన్న అపోహాలను, సందేహాలను నివృత్తిచేశారు. పరీక్షలు సమీపిస్తున్న తరుణంలో విద్యార్థులు ఒత్తిడికి గురికాకుండా ఉండడానికి పాటించాల్సిన నియమాలను వివరించారు. పరీక్షలకు ముందున్న సమయాన్ని విద్యార్థులు ఏవిధంగా వినియోగించుకోవాలి.. ఎలా చదివితే ఎక్కువ మార్కులు సంపాదించవచ్చు.. చదివే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి.వెంకట్‌రావ్, ఎస్ఎంసీ మాజీ చైర్మన్ గంగన్న, ఉపాధ్యాయులు రాజేందర్, తదితరులున్నారు.

కాంగ్రెస్ ప్రజల ప్రభుత్వం

• బోథ్ నియోజక వర్గ ఇన్‌చార్జి గజేందర్

నేరడిగొండ, ఫిబ్రవరి22: కాంగ్రెస్ ప్రజల ప్రభుత్వమని బోథ్ నియోజకరవ్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్ అన్నారు. మండలంలోని రోల్‌మామడ గ్రామస్థుల ఆహ్వన మేరకు వారి గ్రామాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా వారి సమస్యలపై గజేందర్ మాట్లాడుతూ ప్రతీగూడెంలో ప్రతీతండాలో అభివృద్ధి చేసే బాధ్యత తీసుకుంటానని అన్నారు. కార్యక్రమంలో బోథ్ వ్యవసాయ మార్కెట్‌కమిటీ వైస్‌చైర్మన్ ఆడే వసంతరావు, కాంగ్రెస్ పార్టీ నాయకులు రాజశేఖర్‌రెడ్డి, బోథ్ అసెంబ్లి యూత్ అధ్యక్షులు బద్దంపోతారెడ్డి, బోథ్ ఎంపీటీసీలు, షేక్ రజీయాబేగం, కురుమే మహేందర్, మాజీ సర్పంచ్‌లు మేరాజ్, సాయన్న, గ్రామపటేల్ యాదవ్, గ్రామస్థులు, నాయకులున్నారు.

ముదిరాజ్ మహాసభ క్యాలెండర్‌ను ఆవిష్కరించిన ఈటల

గుడిహత్నూర్, ఫిబ్రవరి 22: తెలంగాణ ముదిరాజ్ మహాసభ రాష్ట్రస్థాయి2024 క్యాలెండర్‌ను మండల కేంద్రంలో రుద్రస్మార్ట్ సిటీ ఆవరణలో ఎంపీ సోయం బాపూరావు, ఎమ్మెల్యే పాయల శంకర్‌లతో కలిసి బీజేపీ నేత ఈటెల రాజేందర్ ఆవిష్క రించారు. కార్యక్రమంలో ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సలేందర్, శివయ్య ముదిరాజ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు బొజ్జ నారాయణ ముదిరాజ్ ఉన్నారు.



విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్ రాజ్

పదిలో వందశాతం ఉత్తీర్ణత సాధించాలి

• కలెక్టర్ రాహుల్‌రాజ్

గుడిహత్నూర్, ఫిబ్రవరి 22: పదో తరగతి పరీక్ష ఫలితాల్లో విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలను కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు. పదో తరగతి గదికి వెళ్లి విద్యార్థుల అభ్యాసన సామర్థ్యాలను పరిశీలించారు. గణితం, భౌతిక రసాయన శాస్త్రం సబ్జెక్టులకు సంబంధించిన పలు ప్రశ్నలను అడిగి సమాధానాలు తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థుల నుద్దేశించి మాట్లాడుతూ కష్టంతో కాకుండా ఇష్టంతో చదువుకోవాలని, దీంతో పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించవచ్చన్నారు. ఇప్పటి నుంచే జీవితంలో ఒక లక్ష్యం పెట్టుకోవాలని అన్నారు. కలెక్టర్‌వెంట తహసీల్దార్ కవితారెడ్డి, ఎంఈవో నారాయణ, హెచ్ఎం దేవదాసు తదితరులు ఉన్నారు.



మధ్యాహ్న భోజనం నిర్వాహకులతో మాట్లాడుతున్న కలెక్టర్

అప్పు కోసం కేంద్రం చుట్టూ తిరుగుతున్న రేవంత్‌రెడ్డి

• పోడు భూములకు పట్టాలు ఇస్తానని కేసీఆర్ మోసం • హిందువుల కల సాకారం చేసిన మోదీ ప్రభుత్వం: బీజేపీ నేత ఈటల



కొమురంభీం విగ్రహానికి నివాళ్లర్పిస్తున్న ఈటల



రోడ్‌షోలో మాట్లాడుతూ..



భారీగా హాజరైన ప్రజలు

ఇంద్రవెల్లి/ఉట్నూర్, ఫిబ్రవరి22: అమలుకు సాధ్యంకాని ఆరు గ్యారెంటీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు సీఎం రేవంత్‌రెడ్డి అప్పు కోసం ప్రధాని మోదీ, కేంద్రహోం మంత్రి అమిత్‌షా, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ చుట్టూ తిరుగుతున్నారని విమర్శించారు. కొమురంభీమ్ విజయసంకల్ప యాత్ర గురువారం ఇంద్రవెల్లికి చేరింది. ముందుగా ముత్నూర్ గ్రామంలో కొమురంభీమ్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ముత్నూర్ నుంచి ఇంద్రవెల్లి వరకు రోడ్‌షోలో ఆయన పాల్గొని మాట్లాడారు. పోడువ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్న ఆదివాసులకు పోడు భూములకు పట్టాలు ఇస్తానని చెప్పి కేసీఆర్ ఆదివాసీలను మోసం చేశారని, ధరణిని తీసుకొచ్చి పోడు వ్యవసాయం చేసుకుంటున్న రైతులకు ఎలాంటి ఆధారాలు లేకుండా చేశారని ఆరోపించారు. పోడు భూముల సాగు చేసుకుంటున్న ఆదివాసీలకు పట్టాలు ఇవ్వాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతు రుణమాఫీ, రైతుబంధు, మహిళలకు రూ.2500, 200యూనిట్ల ఉచితవిద్యుత్, రూ.500 గ్యాస్ సిలిండర్ ఇప్పటివరకు ఇవ్వలేని చేతగాని ప్రభుత్వమని ఎద్దేవా చేశారు. ఉచిత బస్సు ప్రయాణంతో ప్రయాణీకుల సంఖ్య పెరిగినా, బస్సులు మాత్రం పెరగలేదని, బస్సులను పెంచాలని డిమాండ్ చేశారు. హిందువుల 500ఏళ్ల కల అయోధ్యలో శ్రీ రామ మందిరం ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో సాకారం అయిందని అన్నారు. రాష్ట్ర సమగ్రాభివృద్ధి జరగాలంటే బీజేపీకి ఓటేయాలని, బీజేపీకి అవకాశం ఇవ్వాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీ సోయం బాపూరావు, ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల శంకర్, జడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్ధన్, మాజీ ఎంపీ రాథోడ్ రమేష్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు బ్రహ్మానంద్, స్వచ్ఛ భారత్ జిల్లా కన్వీనర్ దీపక్‌సింగ్, శేఖావత్, మండల అధ్యక్షుడు అరెల్లి రాజలింగం తదితరులు పాల్గొన్నారు.

అలాగే ఉట్నూర్ ఏజెన్సీలోకి అడుగుపెట్టిన విజయ సంకల్పయాత్ర పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో జరిగిన రోడ్‌షోలో ఆయన మాట్లాడారు. ఆరు గ్యారెంటీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రంలోనే ఆదిలాబాద్ జిల్లా బీజేపీ ఎమ్మెల్యేలను అసెంబ్లీకి పంపిన ఘనత దక్కించుకుందన్నారు. తెలంగాణ ఉద్యమంలో సైతం ఆదిలాబాద్ నెంబర్ 1 స్థానంలో ఉందన్నారు. జీవో3 విషయంలో బీజేపీపై కొందరు దుష్ప్రచారం చేస్తున్నారని ఆదిలాబాద్ ఎంపీ సోయంబాపురావ్ అన్నారు. జీవో3 కచ్చితంగా అమలుచేసి గిరిజనులకు ఉద్యోగాలు ఇవ్వాలని అన్నారు. ఆదిలాబాద్ జిల్లాలోని 197 పీవీటీజీల గ్రామాల్లో 24వేల కోట్లతో ప్రధానమంత్రి కార్యక్రమాన్ని చేపడుతున్నారన్నారు. గ్రామాల్లో మాజీ ఎంపీ రాథోడ్‌రమేష్ మాట్లాడుతూ భారతదేశ హిందువుల చిరకాలవాంచ అయోధ్య రామాలయం నిర్మాణం పూర్తయిందని అన్నారు. కార్యక్రమంలో జడ్పీ చైర్మన్ రాథోడ్ రాథోడ్‌జనార్ధన్, ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయలశంకర్, మాజీ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు, తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న ఎంపీపీ పంద్రాజైవంత్‌రావు

నీటి సమస్య తలెత్తకుండా చూడాలి: ఎంపీపీ

ఉట్నూర్, ఫిబ్రవరి 22: మండలంలోని అన్ని గ్రామాల్లో వేసవికాలం మంచినీటి సమస్య తలెత్తకుండా చర్యలు చేపట్టాలని మండల పరిషత్ అధ్యక్షుడు పంద్రజైవంతరావు అధికారులను కోరారు. గురువారం ఆర్ డబ్ల్యుఎస్ అధికారులు,మండల అధికారులు, పంచాయతీ కార్యదర్శులతో మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ మారుమూల గ్రామాల్లో నీటి సమస్యలు వస్తాయని, ముందస్తుగానే సమస్య రాకుండా అధికారులు పని చేయాలన్నారు. ప్రతీ 15రోజులకు సమీక్ష సమావేశం ఉంటుందన్నారు. సమావేశంలో ఎంపీడీవో మురళిధర్‌శర్మ, ఎంపీవో లింగయ్య, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ సురేందర్, మండల అధికారులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

ఏఐటీయూసీ ఆధ్వర్యంలో రిమ్స్ కార్మికుల నిరసన

ఆదిలాబాద్ అర్బన్, ఫిబ్రవరి 22: ఆదిలాబాద్‌లోని రిమ్స్, సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రుల్లో పనిచేస్తున్న కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గురువారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. రిమ్స్‌లోని ఎమర్జెన్సీ డిపార్ట్‌మెంట్ ఎదుట మధ్యాహ్న భోజన సమయంలో భద్రత, పేషెంట్‌కేర్ సిబ్బంది నిరసన తెలిపారు. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు కార్మికులకు వేతనాలు చెల్లించాలని నాయకులు సిర్ర దేవేందర్ డిమాండ్ చేశారు.

'గ్రామాల అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యం'

తలమడుగు, ఫిబ్రవరి 22: మారుమూల గ్రామాల అభివృద్ధి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని జడ్పీటీసీ గోకగణేష్‌రెడ్డి అన్నారు. గురువారం మండలలోని మండలంలోని బరంపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని కొలాంగూడ సందర్శించి గతంలో కురిసిన భారీ వర్షాలకు కొట్టుకు పోయిన కల్వర్టుని పరిశీలించి త్వరగా పనులు ప్రారంభిస్తామని గిరిజనులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జడ్పీటీసీ గోకగణేష్‌రెడ్డి, ఎంపీపీ కళ్యాణలక్ష్మి రాజేశ్వర్, ఐటీడీఏ ఏఈ సుధాకర్, గ్రామస్థులు ప్రతాప్; నర్సయ్య, బాపురావు, లక్ష్మణ్, పోశెట్టి తదితరులు పాల్గొన్నారు. అలాగే నడిమిపల్లె గ్రామంలో కొత్తగా మంజూరైన సీసీ రోడ్లు, అంగన్‌వాడీ సెంటర్‌కి స్థలాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ గోకగణేష్‌రెడ్డి, ఎంపీపీ కళ్యాణం లక్ష్మిరాజేశ్వర్, ఐటీడీఏ, ఏఈ సుధాకర్, రమేష్‌రెడ్డి, గ్రామస్థులు పాల్గొన్నారు.



ఆదివాసీ గిరిజనులతో మాట్లాడుతున్న జడ్పీటీసీ, ఎంపీపీ

పరీక్షలపై విద్యార్థుల్లోని భయాన్ని దూరం చేయాలి

• రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు ఈశ్వరిబాయి



విద్యార్థులతో మాట్లాడుతున్న రాష్ట్ర కమిషన్ సభ్యురాలు ఈశ్వరిబాయి

నేరడిగొండ, ఫిబ్రవరి 22: పదో తరగతి పరీక్షలపై విద్యార్థుల్లో ఉన్న భయాన్ని దూరం చేయాలని రాష్ట్ర మహిళాకమిషన్ సభ్యురాలు కుమ్ర ఈశ్వరిబాయి అన్నారు. మండలంలోని బుగ్గారంలో గల గిరిజన గురుకుల బాలికల పాఠశాల, కళాశాలను సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థినిలకు కల్పిస్తున్న వసతిసౌకర్యాలను విద్యార్థులతో అడిగి తెలుసుకున్నారు. పదో తరగతి, ఇంటర్ విద్యార్థులతో ముచ్చటించారు. పరీక్షలు సమీపిస్తున్న వేళ భయం వీడి పరీక్షలకు సిద్ధంగా ఉండాలన్నారు. పరీక్షల సమయం ఆసన్నమవుతున్న సందర్భంగా పదవ తరగతి విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించి మెరుగైన ఫలితాలు సాధించి ఉత్తీర్ణత శాతం పెంచాలన్నారు. అనంతరం పాఠశాల పరిసరాలను, వంట సరుకులను, విద్యార్థుల మధ్యాహ్న భోజనాన్ని, ఉపాధ్యాయుల హాజరురిజిస్టర్లను పరిశీలించారు. అనంతరం ఉపాధ్యాయ బృందం ఈశ్వరిబాయి శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ కృష్ణవేణి, వైస్‌ప్రిన్సిపాల్ స్రవంతి, మహేశ్వరి, వార్డెన్ అరుణ, ఉపాధ్యాయులు ఉన్నారు.

రంజాన్‌మాసంలో ప్రత్యేక సౌకర్యాలు కల్పించండి : ఎంఐఎం

నిర్మల్ కల్చరల్, ఫిబ్రవరి 22 : వచ్చే నెల 11 నుంచి పవిత్ర రంజాన్ మాస ఉపవాస దీక్షలు ప్రారంభం కానునందున ప్రత్యేక సౌకర్యాలు కల్పించాలని జిల్లా ఎంఐఎం అధ్యక్షుడు అజీమ్ బిన్ యాహియా కోరారు. గురువారం కలెక్టర్ కార్యాలయంలో వినతి పత్రాన్ని అందజేస్తూ వీధి దీపాలు, తాగునీటి సౌకర్యం కల్పించాలని కోరారు. ప్రార్థనా మందిరాల్లో సైతం కనీస సౌకర్యాలు ఏర్పాటుకు మున్సిపల్ అధికారులను ఆదేశించాలని కోరారు.



జన సంద్రమైన జంపన్నవాగు పరిసర ప్రాంతాలు

శిగాలూగుతున్న వనం

- మేడారం జాతరకు పోటెత్తుతున్న భక్తులు
- గద్దెపైకి సమ్మక్క రావడంతో జోరుగా మొక్కులు
- ప్రశాంతంగా ముగిసిన అద్వితీయ ఘట్టం
- పతాక స్థాయికి 'వన' సంరంభం
- కిటకిటలాడిన తల్లుల గద్దెలు



చిలుకలగుట్ట నుంచి సమ్మక్కను తీసుకువస్తున్న పూజారులు



సమ్మక్కకు మొక్కుగా గొర్రెపిల్లను ఎదుర్కోలు ఇస్తున్న భక్తులు





క్యూలైన్లలో భక్తుల రద్దీ







మేడారం బృందం, ఫిబ్రవరి 22: సమ్మక్క - సారలమ్మ జాతరతో వనం శిగాలూగుతోంది. మేడారం భక్తిపారవశ్యంతో మురిసిపోతోంది. మహాజాతరలో తొలిరోజైన బుధవారం అర్ధరాత్రి సారలమ్మ గద్దెపై కొలువు దీరగా.. భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. రెండోరోజైన గురువారం ఉదయం నుంచి జరిగిన ప్రత్యేకపూజల అనంతరం మాఘశుద్ధ పౌర్ణమి వెలుగుల్లో చిలుకలగుట్ట నుంచి జనంలోకి వచ్చిన సమ్మక్క.. గద్దెపై కొలువుదీరారు. ఆ అమ్మ ఆగమనంతో జాతర పతాకస్థాయికి చేరింది. తల్లిని దర్శించుకునేందుకు ఎదురుచూసిన లక్షలాది భక్తులు భక్తి పారవశ్యంలో మునిగితేలారు. ప్రస్తుతం మేడారం పరిసరాల్లో కోటి మందికిపైగా భక్తులు విడిది చేసి ఉన్నారు. శుక్రవారం భక్తుల రాక రెట్టింపు కానుందని అంచనా వేస్తున్నారు. ఇప్పటికే ఎటుచూసినా ఇసుకేస్తే రాలనంత జనంతో మేడారం.. పుణ్యస్నానాలు చేసే వచ్చే భక్తులతో జంపన్నవాగు తీరం.. తల్లులను దర్శించుకుంటున్న భక్తులతో గద్దెల ప్రాంగణాలు కిటకిటలాడుతున్నాయి.

గద్దెపైకి సమ్మక్క

గురువారం రాత్రి సమ్మక్క గద్దెపైకి చేరుకోవడంతో జాతరలో ఓ అద్భుత ఘట్టం ఆవిష్కృతమైంది. ఉదయమే పూజారులు మేడారంలోని సమ్మక్క గుడిలో సమ్మక్కను తరలించే ప్రక్రియను ప్రారంభించి.. ప్రత్యేక పూజలు చేశారు. ఆ తర్వాత పూజారుల బృందం అడవికి వెళ్లి కంకవనాన్ని తీసుకురాగా.. ఈ తంతులో మంత్రి ధనసరి అనసూయ సీతక్క పాల్గొన్నారు. కంకవనాన్ని సమ్మక్క గద్దెపై ఉంచి పూజలు చేశారు. సాయంత్రం సుమారు 5 గంటలకు ప్రధాన పూజారి కొక్కెర క్రిష్ణయ్య నేతృత్వంలో పూజారుల బృందం చిలుకల గుట్టకు బయలు దేరింది. మధ్యలో క్రిష్ణయ్య ఒక్కరే సమ్మక్క స్థావరం వద్దకు వెళ్లి పూజలు చేశారు. తల్లి కుంకుమ భరిణె రూపాన్ని తీసుకొని కిందకు చేరుకున్నారు. ఈ క్రమంలో ములుగు ఎస్పీ శబరీష్ గాల్లోకి కాల్పులు జరిపి వందనం సమర్పించారు. మంత్రి సీతక్క, కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ శబరీష్, ఇతర ఉన్నతాధికారులు స్వాగతం పలికారు. రోప్ పార్టీ బలగాల సాయంతో పూజారులు సమ్మక్కను మేడారం గద్దెకు తోడ్కొని వచ్చారు. ఈ క్రమంలో భక్తులు పలు చోట్ల కోళ్లు, మేకలను బలి ఇచ్చారు. గద్దెల వద్ద సమ్మక్కను ప్రతిష్ఠించిన అనంతరం ప్రత్యేక పూజలు చేసి ఆ తర్వాత భక్తులకు దర్శనానికి అనుమతిచ్చారు. అయితే బుధవారమే సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజు గద్దెలపైకి చేరుకోగా.. సమ్మక్క రాకతో జాతరకు పరిపూర్ణత వచ్చింది. సమ్మక్క వన ప్రవేశం జరిగే శనివారం సాయంత్రం వరకు భక్తులు మొక్కులు చెల్లించుకోనున్నారు.



సమ్మక్క గద్దె

ప్రముఖుల రాక

గురువారం పలువురు ప్రముఖులు మేడారాన్ని సందర్శించారు. కేంద్ర సాంస్కృతిక వ్యవహారాలు, పర్యాటక శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డితో పాటు పలువురు బీజేపీ నాయకులు తల్లులను దర్శించుకున్నారు. మాజీ స్పీకర్ సిరికొండ మధుసూదనాచారి, మాజీ మంత్రి సత్యవతి రాథోడ్, మహబూబాబాద్ ఎంపీ మాలోతు కవిత తదితరులు మొక్కులు చెల్లించుకున్నారు. శుక్రవారం గవర్నర్ తమిళిసై సౌందరరాజన్, సీఎం వేముల రేవంత్ రెడ్డి తదితరులు మేడారానికి వస్తున్నారు.

రేపటి నుంచి కాల్వ తండాలో

జగదాంబ సేవాలాల్ జాతర

దిలావర్‌పూర్, ఫిబ్రవరి 22 : మండలంలోని కాల్వ తండాలో శనివారం నుంచి జగదాంబ సేవాలాల్ జాతర నిర్వహిస్తున్నట్లు గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షుడు దరావత్ రవీందర్ నాయక్, తాజా మాజీ సర్పంచ్ రామావత్ నీలాబాయి రవి, ఎంపీటీసీ బాపురావులు తెలిపారు. జగదాంబ, సేవాలాల్ ఆలయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని ఆలయంలో సంప్రదాయ పూజలతో జాతర ప్రారంభమవుతుందన్నారు. భక్తులకు అన్నదానం కార్యక్రమం కూడా ఉంటుందని వారు తెలిపారు. భక్తులు జగదాంబ సేవాలాల్ మహారాజ్‌లను దర్శించుకునేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు వారు పేర్కొన్నారు.

అబుల్ కలాం ఆజాద్‌కు ఘన నివాళి

ఖానాపూర్, ఫిబ్రవరి 22 : స్వాతంత్ర్య సమర యోధులు, భారత తొలి విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ ఆశయాలు నెరవేర్చాలంటే యువత విద్య బాట పట్టాలని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. గురువారం ఆయన 66వ వర్ధంతిని పురస్కరించుకొని ఖానాపూర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పలువురు మాట్లాడారు. ఈ సందర్భంగా స్థానిక తెలంగాణ చౌక్‌లో అబుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం భారత స్వాతంత్ర్య ఉద్యమ సమయంలో మౌలానా అబుల్ కలాం ఆజాద్ చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఖానాపూర్ మున్సిపల్ కాంగ్రెస్ ఫ్లోర్‌లీడర్ రాజుర సత్యం, ఖానాపూర్ తహసీల్దార్ శివరాజ్, ఏఎస్సై మణిరాం, తాజా మాజీ వైస్ చైర్మన్ అబ్దుల్ ఖలీల్, కాంగ్రెస్ పార్టీ మండల జనరల్ సెక్రటరీ షబ్బీర్ పాషా, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు పరిమి సురేష్, కాంగ్రెస్ పార్టీ మండల మైనారిటీ అధ్యక్షులు సలీం ఖాన్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు నిమ్మల రమేష్, సీనియర్ నాయకులు జహీర్ అహ్మద్, కడార్ల గంగ నర్సయ్య, కాంగ్రెస్ మైనారిటీ పట్టణ అధ్యక్షులు షౌకత్ పాషా, సయ్యద్ ఆయుబ్, మీర్జా బేగ్, రియాజ్ ఖాన్, బీఆర్ఎస్ మైనారిటీ నాయకులు ఇర్ఫాన్ దానిష్, సయ్యద్ ఫహీం, షఫీ, ఎంఐఎం నాయకులు అఖిల్, అఫ్సర్, శారు, నాయకులు పరంకుశం శ్రీనివాస్, శేషాద్రి, ముజీబ్, మైస శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

నిర్మల్ కల్చరల్ : జిల్లా కేంద్రంలో గురువారం మౌలానా అబుల్ కలాం ఆజాద్ 66వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. చైర్మన్ ఈశ్వర్ హాజరై ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎంఐఎం అధ్యక్షుడు అజీమ్ బీన్ యాహియా, కౌన్సిలర్లు నరహరి, ఇమ్రానుల్లా, కోఆప్షన్ సభ్యుడు మజహర్, వ్యవస్థాపక అధ్యక్షుడు మొహమ్మద్ ఉస్మాన్, షైక్ ఇంతియాజ్, షాదుల్లా హుస్సేన్, జుబేర్ హుస్సేన్, షకీల్, ఖదీర్, ఇస్మాయిల్ తదితర నాయకులు పాల్గొన్నారు.

ఓటరు జాబితాను

పకడ్బందీగా తయారు చేయండి

లక్ష్మణచాంద, ఫిబ్రవరి 22 : ఓటరు జాబితాను పకడ్బందీగా తయారు చేయాలని తహసీల్దార్ జానకి గురువారం అన్నారు. మండల కేంద్రంలోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్ర అధికారుల (బీఎల్‌వో) సమావేశంలో ఆమె మాట్లాడుతూ... పలు సూచనలు చేశారు.

బాసర ట్రిపుల్ ఐటీలో విద్యార్థిని ఆత్మహత్య

● ఈ విద్యా సంవత్సరములో ఇది ఐదవ ఘటన ● భయాందోళనలో వర్సిటీ విద్యార్థులు

భైంసా / బాసర, ఫిబ్రవరి 22 : నిర్మల్ జిల్లా బాసర ఆర్జీయూకేటీ ట్రిపుల్ ఐటీలో గురువారం రాత్రి శిరీష అనే విద్యార్థిని హాస్టల్ గదిలో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. సంగారెడ్డి జిల్లా దాపూర్ మండలం మానూర్ గ్రామానికి చెందిన శిరిష (17) అనే విద్యార్థిని ఈ యేడాది ట్రిపుల్ ఐటీలో ప్రవేశం పొంది పీయూసీ (ప్రీ యూనివర్సిటీ కోర్సు) మొదటి సంవత్సరం చదువుతోంది. గురువారం రాత్రి భోజనానికి వెళ్లి వచ్చిన విద్యార్థులకు హాస్టల్ గదిలో శిరిష ఆత్మహత్య చేసుకోవడం గమనించడంతో.. ఒక్కసారిగా షాక్‌కు గురయ్యారు. వెంటనే అధికారులకు సమాచారం అందించారు. విద్యార్థిని వ్యక్తిగత కారణాలతో ఆత్మహత్యకు పాల్పడిందా!? లేక ఒత్తిడితోనా!? లేని పక్షంలో మరే ఇతర కారణాలు ఉన్నాయా!? అన్న విషయం తెలియాల్సి ఉంది. పోలీసులు ఘటనా స్థలికి చేరుకొని విచారణ జరుపుతున్నారు.

మరోవైపు.. ఈ విద్యా సంవత్సరం ప్రారంభమైన నాటి నుంచి ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో ఆత్మహత్య ఘటన ఇది ఐదవది. గత ఏడాది జూన్ 14న వడ్ల దీపిక పీయూసీ -1 చదివే విద్యార్థిని పరీక్ష హాల్‌కు సెల్‌ఫోన్ తీసుకవచ్చిందనే కారణంగా అధికారులు మందలించడంతో.. మనస్థాపం చెంది బాత్‌రూమ్‌లో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. మరుసటి రోజు జూన్ 15వ తేదీన బుర్ర లిఖిత అనే పీయూసీ -1 విద్యార్థిని హాస్టల్ భవనంపై నుంచి పడి ప్రాణాలు విడిచింది.

ఆ తర్వాత ఆగస్టు 8వ తేదీన జాదవ్ బబ్లూ పీయూసీ -1 చదువుతున్న విద్యార్థి తరగతి గదిలో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. రాథోడ్ సురేష్ అనే ఇంజనీరింగ్ విద్యార్థి ఆగస్టు 23వ తేదీన హాస్టల్ గదిలో ఉరి వేసుకొని బలవన్మరణానికి పాల్పడ్డాడు. తాజాగా గురువారం రాత్రి శిరీష అనే విద్యార్థిని ఉరేసుకొని ఆత్మ హత్యకు పాల్పడింది.

ఈ విద్యా సంవత్సరంలోనే ఐదు గురు ఆత్మహత్యకు పాల్పడగా.. అందులో నలుగురు విద్యార్థులు ఈ ఏడాది కొత్తగా ప్రవేశ పొందిన విద్యార్థులే ఉండటం గమనార్హం. ఇలా వరుస ఆత్మహత్యలతో యూనివర్సిటీలోని మిగతా విద్యార్థులు భయాందోళన చెందుతున్నారు.

భైంసా మున్సిపల్ బడ్జెట్‌కు కౌన్సిల్ ఏకగ్రీవ ఆమోదం

● ఏడాది వ్యవధిలో మూడు రెట్లకుపైగా పెరిగిన అంచనా ఆదాయ, వ్యయాలు
● 2024-25 అంచనా బడ్జెట్ ఆదాయ, వ్యయాలు రూ.56.22 కోట్లు

భైంసా, ఫిబ్రవరి 22 : పట్టణ మున్సిపల్ 2024-25 సంవత్సరపు వార్షిక అంచనా, వ్యయాల బడ్జెట్ పద్దుకు భైంసా మున్సిపల్ కౌన్సిల్ ఏకగ్రీవంగా ఆమోదించింది. గురువారం మున్సిపల్ చైర్ పర్సన్ సాబీయ బేగం అధ్యక్షతన జరిగిన బడ్జెట్ పద్దు సమావేశానికి ముథోల్ ఎమ్మెల్యే పవార్ రాంరావ్ పాటిల్, లోకల్ బాడీస్ అడిషనల్ కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, వైస్ చైర్మెన్ జాబీర్ అహ్మద్‌తో పాటు మున్సిపల్ అధికార, పాలక వర్గాలు పాల్గొన్నాయి. మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వరరావ్ 2024-24 సంవత్సరపు వార్షిక అంచనా ఆదాయం రూ.56.22 కోట్లు, వ్యయం రూ.56.22 కోట్ల వ్యయంతో రూపొందించిన బడ్జెట్ పద్దును ప్రవేశపెట్టారు. మున్సిపల్ కౌన్సిల్ రూపొందించిన ఈ బడ్జెట్‌లో ప్రారంభ నిల్వ, ప్రభుత్వ గ్రాంట్లు కలుపుకొని బడ్జెట్‌ను అంచనా వేసింది. ఇందులో 2023- 24 సంవత్సరపు వార్షిక అంచనా ఆదాయం మిగులు బడ్జెట్ రూ.7 లక్షలు, 2024-25 సంవత్సరపు వార్షిక ప్రారంభ బడ్జెట్ నిల్వగా పొందుపరుస్తూ సొంత రెవెన్యూ, సొంత వ్యయం, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల గ్రాంట్స్‌ను అంచనా వేస్తూ బడ్జెట్ అంచనా పద్దును ప్రవేశపెట్టారు. కౌన్సిల్ సభ్యులందరూ అంచాన బడ్జెట్ పద్దుకు ఏకగ్రీవంగా అమోద ముద్ర వేసారు.

● ఏడాది వ్యవధిలో మూడు రెట్లకు పెరిగిన బడ్జెట్ అంచనా ఆదాయ, వ్యయాలు

పట్టణ మున్సిపల్ 2024-25 సంవత్సరపు వార్షిక బడ్జెట్ అంచనా ఆదాయ, వ్యయాల పద్దు ఏడాది కాల వ్యవధిలో మూడు రేట్లకు పైగా పెరిగింది. 2023-24 సంవత్సరపు వార్షిక సవరించిన అంచనా బడ్జెట్ అంచనా, వ్యయాల పద్దు రూ.15.53 కోట్లతో రూపొందించగా అమోదించారు. రానున్న 2024-25 సంవత్సరపు వార్షిక బడ్జెట్ అంచనా గత వార్షిక సంవత్సరముతో పోల్చి చూస్తే మూడు రేట్లకు పైగా పెరిగింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల గ్రాంట్లు అధికంగా వస్తాయనే అంచనాతో రానున్న వార్షిక బడ్జెట్ అంచనా ఆదాయ, వ్యయాలను పెంచినట్లుగా తెలిసింది. గత వార్షిక సంవత్సరపు బడ్జెట్ రూ.15.53 కోట్లు మాత్రమే ఉండగా రానున్న వార్షిక సంవత్సరపు బడ్జెట్ అంచనా ఆదాయ,వ్యయాల పద్దు రూ.56.22 కోట్లతో రూపొందించి ఏకగ్రీవంగా అమోదించారు.



మిషన్ భగీరథ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న మున్సిపల్ వైస్ చైర్మన్ జాబీర్ అహ్మద్

● మిషన్ భగీరథ నిర్వహణ సమస్యలపై ఏకరువు

బడ్జెట్ సమావేశంలో మున్సిపల్ కౌన్సిల్ సభ్యులందరూ మిషన్ భగీరథ నిర్వహణ సమస్యలపై ఎకరువు పెట్టారు. ఏ వార్డు పరిధిలో చూసిన మిషన్ భగీరథ నీటి సరఫరా వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉందని కౌన్సిలర్లు సభ దృష్టికి తీసుకవచ్చారు. సమావేశంలో పాల్గొన్న ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామరావ్ పాటిల్, లోకల్ బాడీస్ అడిషనల్ కలెక్టర్ ఫైజాన్ అహ్మద్‌లకు నీటి సమస్యలను వివరించారు. సభలోనున్న మిషన్ భగీరథ అధికారులను ఎమ్మెల్యే పవార్ రాంరావ్ పాటిల్, అడిషనల్ కలెక్టర్ ఫైజాన్ అహ్మద్‌లు సమస్యలపై ప్రశ్నించారు. ఈ సందర్భంగా వైస్ చైర్మెన్ జాబీర్ అహ్మద్ మిషన్ భగీరథ అధికారులపై ఆగ్రహావేశాలు వ్యక్తం చేశారు. ఎన్ని పర్యాయాలు సమస్యలపై ఫిర్యాదు చేసిన స్పందించడం లేదని ఫిర్యాదు చేశారు. ఇందుకు స్పందించిన ఎమ్మెల్యే పవార్ రామరావ్ పాటిల్ 12 రోజుల వ్యవధిలోగా నీటి సరఫరా సమస్యలన్నింటిని పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టాలని మిషన్ భగీరథ అధికారులను ఆదేశించారు. అంతేకాకుండా సమస్య పరిష్కరమయ్యేంత వరకు పట్టణ పరిధిలో బోరుబావుల ద్వారా కొనసాగుతున్న మిని ట్యాంక్‌లను యధావిధంగా కొనసాగించాలని, వాటికి సంబంధించిన పంప మోటార్లను తొలగించరాదని మున్సిపల్ అధికారులకు సూచించారు.



కొత్తగా నిర్మించిన శ్రీరామ ఆలయం, ప్రతిష్ఠాపనకు సిద్ధంగా ఉన్న సీతారామ విగ్రహాలు (ఇన్‌సెట్లో)

లక్ష్మీపూర్ రామాలయంలో

విగ్రహ ప్రతిష్ఠాపనకు సర్వం సిద్ధం

● రేపటి నుంచి లక్ష్మీపూర్ గ్రామంలో ఉత్సవాలు ● ఆలయంలో ప్రత్యేక పూజలు

జైనథ్, ఫిబ్రవరి22: మండలంలోని మారుమూల గ్రామమైన లక్ష్మీపూర్‌లో కొత్తగా నిర్మించిన శ్రీరామ ఆలయంలో రేపటి నుంచి విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. గత కొన్ని సంవత్సరాలుగా రామాలయ నిర్మాణం గ్రామస్థుల చిరకాల కోరిక ఫలించింది. రామాలయం నిర్మాణ విగ్రహ ప్రతిష్ఠాపనకు సర్వం సిదమైంది. ఈనెల 24, 25, 26 తేదీల్లో జరుగనున్న రామాలయంలో రాముడు సీతాలక్ష్మిగా హనుమాన్ ఇతర విగ్రహాల ప్రతిష్ఠాపన కోసం ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. కార్యక్రమానికి లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన ప్రజలు, రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌తో పాటు వివిధ జిల్లాల్లో స్థిరపడి ఉన్న ప్రజలు గ్రామ మహిళలు, కుటుంబ సభ్యులు తరలిరానున్నారు. గ్రామానికి చెందిన ప్రజలకు ఎదురయ్యే సమస్యలు తీరి ప్రజలు పాడి పంటలతో చల్లంగా ఉండాలని శ్రీరామున్ని లక్ష్మీపూర్ గ్రామస్థులు వేడుకుంటున్నారు.

సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ఇంద్రవెల్లి, ఫిబ్రవరి22: సైబర్‌నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై దుబ్బాక సునీల్ సూచించారు. గురువారం మండలంలోని దన్నోర్ (బీ) గ్రామంలో గ్రామస్థులకు సైబర్ నేరాలు, షీటీమ్‌లపై పోలీసుశాఖ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఆన్‌లైన్ మోసాలపై గుర్తెరిగి మసలుకోవాలన్నారు. విద్యార్థినులు సెల్‌ఫోన్లకు దూరంగా ఉంటూ క్రమశిక్షణతో చదివి తల్లిదండ్రుల కలలు సాకారం చేయాలని సూచించారు. గుర్తు తెలియని వ్యక్తులు తమకు తెలిసిన వ్యక్తుల ఫోటోల మాదిరిగా మార్ఫింగ్ చేసి వీడియో కాల్‌చేసి డబ్బులు అడుగుతారని తెలిపారు. అలాంటి కాల్స్ పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, గ్రామస్తులున్నారు.



సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్న పోలీసులు

విద్యుత్ కొరత లేదు : ఎస్ఈ జేఆర్ చౌహాన్

నిర్మల్ కల్చరల్, ఫిబ్రవరి 22 : జిల్లాలో విద్యుత్ కొరత లేదని ఆ శాఖ ఎస్ఈ జేఆర్ చౌహాన్ అన్నారు. గురువారం నిర్మల్ డివిజన్ విద్యుత్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... గృహ, వ్యవసాయ, వినియోగానికి ఎలాంటి కొరత లేదన్నారు. విద్యుత్ కోతలు ఉండదని స్పష్టం చేశారు. విద్యుత్ అంతరాయం ఏర్పడితే అధికారుల దృష్టికి తీసుకురావాలని ప్రజలకు సూచించారు. సమస్యలు వెంటనే పరిష్కరిస్తారన్నారు. విద్యుత్‌కోతలపై వస్తున్న వదంతులను ప్రజలు నమ్మవద్దన్నారు. డీఈలు నాగరాజు, శ్రీనివాస్‌రావు, ఏడీఈలు, ఏఈలు, సిబ్బంది సమావేశంలో పాల్గొన్నారు.

కొయ్యబొమ్మకు కష్టకాలం



- కొయ్యబొమ్మల తయారీకి కలప కొరత
- గడ్డు పరిస్థితి ఎదుర్కొంటున్న పరిశ్రమ
- ప్రధాని మోదీ ఎన్నికల హామీపై ఆశలు
- ప్రత్యేక పాలసీ కోసం ఎదురుచూపులు
- శిక్షణతో దక్కని ప్రయోజనం
- వెంటాడుతున్న పొనికి కలప కొరత



పొనికి కర్ర కోసం సాగు చేస్తున్న మొక్క



బొమ్మల తయారీకి ఉపయోగించే పొనికి కర్ర ఇదే



ఏనుగు బొమ్మకు మెరుగులు దిద్దుతున్న కళాకారుడు

నిర్మల్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : నిర్మల్ కొయ్య బొమ్మల కళాకారులకు క్రమంగా కష్టకాలం వచ్చింది. సాంప్రదాయ పద్ధతిలో తయారు చేస్తున్న కొయ్య బొమ్మలకు బహిరంగ మార్కెట్‌లో డిమాండ్ ఉన్నప్పటికీ ముడి సరుకుల ధరలు పెరిగిపోవడం, అలాగే పొనికి కర్రకు కొరత ఏర్పడుతుండడంతో పాటు ఎగుమతులు, దిగుమతులకు సంబంధించిన విధానం సక్రమంగా లేకపోవడం, ప్రభుత్వం ఈ పరిశ్రమను ఆశించిన రీతిలో ప్రోత్సహించకపోతుండడంతో దీని మనుగడ ప్రశ్నార్థకమవుతోంది. ముడిసరుకు ధరల పెరుగుదల బొమ్మల తయారీపై ప్రభావం చూపుతోందని తద్వారా కళాకారుల ఉపాధికి గండి పడుతోందంటున్నారు. నిర్మల్ కొయ్యబొమ్మలకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రత్యేక గుర్తింపు ఉన్న సంగతి తెలిసిందే. అయితే ఇక్కడ తయారయ్యే కొయ్య బొమ్మలను దేశ, విదేశాల్లో కూడా విక్రయిస్తుంటారు. అంతర్జాతీయ మార్కెట్‌లో కూడా ఈ కొయ్య బొమ్మలకు ఆశించిన మేరకు డిమాండ్ ఉన్నప్పటికీ సాంప్రదాయ రీతిలో ఉన్న మోడల్స్‌కు క్రమంగా ఆదరణ తగ్గుతోంది. అలాగే కొయ్య బొమ్మల తయారీ కోసం ఉపయోగించే ముడిసరుకు ధరలు పెరిగిపోవడం ఇతర ఖర్చులు భారీగా పెరగడంతో ప్రస్తుతం కొయ్య బొమ్మల ధరలు కూడా పెరిగాయి. ముడిసరుకు కొరత, ధరల పెరుగుదలతో బొమ్మలకు గిరాకీ క్రమంగా తగ్గుతుంది. ఈ పరిశ్రమను బలోపేతం చేసేందుకు గాను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎలాంటి కార్యాచరణను చేపట్టకపోతుండడం కూడా ఈ పరిశ్రమకు శాపంగా మారుతుంది. అయితే ఈ నేపథ్యంలోనే గత నెల 26వ తేదీన బీజేపీ తరఫున ఎన్నికల ప్రచారం కోసం వచ్చిన ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఈ కొయ్య బొమ్మల పరిశ్రమను ఆదుకుంటామని, రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విధ్వంసం చేసిందని, కళాకారుల పొట్ట కొట్టిందంటూ ప్రకటించారు. కేంద్ర ప్రభుత్వం అన్ని విధాలుగా కొయ్య బొమ్మల పరిశ్రమను ఆదుకుంటుందని ఈ పరిశ్రమను ప్రోత్సహించేందుకు ప్రత్యేక విధానాన్ని రూపొందిస్తామంటూ మోదీ హామీ ఇచ్చారు. ప్రధాని మోదీ హామీతో నిర్మల్ కొయ్య బొమ్మల కళాకారుల కుటుంబాల్లో కొత్త ఆశలు నెల కొన్నాయి. అయితే ఎన్నికలు ముగిసి రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పడినప్పటికీ ఇప్పటి వరకు రాష్ట్ర ప్రభుత్వం ద్వారా గాని, కేంద్ర ప్రభుత్వం ద్వారా గాని కొయ్య బొమ్మల పరిశ్రమకు సంబంధించిన ఎలాంటి ప్రకటన వెలువడకపోతుండడంతో కళాకారులు ఆందోళనకు గురవుతున్నారు. ప్రధాని ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలని వారంతా కోరుతున్నారు. ఇదిలా ఉండగా కొద్ది రోజుల క్రితం కేంద్ర జౌళి శాఖ ఆధ్వర్యంలోని ఎక్స్‌పోర్ట్ ప్రమోషన్ కౌన్సిల్ ఫర్ హ్యాండీక్రాఫ్ట్స్ సంస్థ మార్కెట్‌లో డిమాండ్‌కు అనుగుణంగా నిర్మల్ కొయ్య బొమ్మలకు కొత్త అందాలు తెచ్చేందుకు నిర్ణయం తీసుకొంది. ఇంటర్నేషనల్ లేస్ ట్రేడ్ సెంటర్ ఆధ్వర్యంలో గురు శిష్య హస్త శిల్ప ప్రశిక్షణ కార్యక్రమం కింద నిర్మల్ కొయ్య బొమ్మల కేంద్రాన్ని ప్రత్యేకంగా ఎంపిక చేశారు. తెలంగాణ రాష్ట్రం నుండి కేవలం నిర్మల్ కొయ్య బొమ్మల కేంద్రాన్ని మాత్రమే ఎంపిక చేయడం ప్రాధాన్యతను సంతరించుకుంటుంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తిరుపతిలోని లక్ష్మీ గారి పల్లె, విశాఖ జిల్లాలోని ఏటికొప్పాక, కొండపల్లి బొమ్మలను ఈ పథకం కింద ఎంపిక చేశారు. తెలంగాణ రాష్ట్రంలో మాత్రం కేవలం నిర్మల్ కొయ్య బొమ్మలకు అత్యధిక ప్రాధాన్యత ఇచ్చి కొయ్య బొమ్మల రూపురేఖలను మరింత ఆధునీకరించేందుకు సిద్ధమవుతున్నారు. గురు శిష్య హస్త శిల్ప ప్రశిక్షణలో భాగంగా కేవలం 25 సంవత్సరాల నుండి 30 సంవత్సరాల లోపు ఉన్న యువ కళాకారులకు ప్రాధాన్యతనిచ్చారు. వీరందరికీ మూడు నెలల పాటు ఇక్కడి నిర్మల్ కొయ్య బొమ్మల కేంద్రంలో శిక్షణ నిర్వహించారు. మూడు నెలల పాటు శిక్షణ పూర్తయిన తర్వాత వీరందరికి ఆర్టిజన్ ఐడీ కార్డులను కూడా కేంద్ర జౌళి శాఖ అందించింది. ఈ ఆర్టిస్ ఐడెంటి కార్డుల ద్వారా దేశ, విదేశాలలో నిర్వహించే ట్రేడ్ ఫేర్‌లలో కొయ్య బొమ్మల ప్రదర్శనకు అవకాశాలు ఏర్పడ్డాయి. అలాగే జాతీయ, అంతర్జాతీయ మార్కెట్‌లో కూడా కొయ్య బొమ్మల విక్రయాలకు కేంద్ర జౌళి శాఖ ఆధ్వర్యంలో ఎక్స్‌పోర్ట్ ప్రమోషన్ కౌన్సిల్ ఫర్ హ్యాండీ క్రాఫ్ట్స్ సంస్థ చర్యలు తీసుకోవాలని మొదట్లో భావించారు.



పనిలో నిమగ్నమైన కళాకారులు

శిక్షణతో దక్కని ప్రయోజనం

నిర్మల్‌లోని కొయ్య బొమ్మల కేంద్రం వర్క్‌షాప్‌లో గురు శిష్య హస్త శిల్ప ప్రశిక్షణ కార్యక్రమాన్ని ఇప్పటికే నిర్వహించారు. యువ కళాకారులకు ఆధునిక మోడల్స్ కొయ్య బొమ్మల తయారీకి సంబంధించి అవగాహన కల్పించారు. కేవలం కొయ్య బొమ్మల తయారీతో పాటు బహిరంగ మార్కెట్‌లో రోజురోజుకు పెరుగుతున్న పోటీ, అలాగే ప్రజల ఆసక్తి, డిమాండ్‌ను కూడా పరిగణలోకి తీసుకొని బొమ్మలను తయారు చేసే విధంగా ఇక్కడ శిక్షణ ఇచ్చినప్పటికీ ఆ శిక్షణ ద్వారా కళాకారులకు పెద్దగా ప్రయోజనం చేకూరాలని అంటున్నారు. కేవలం ఓ తంతులాగా మాత్రమే ఈ శిక్షణ కొనసాగిందని కళాకారులు అభిప్రాయపడుతున్నారు.

వెంటాడుతున్న పొనికి కలప కొరత

కాగా గత పదేళ్ల నుండి నిర్మల్ కొయ్య బొమ్మల పరిశ్రమను పొనికి కలప కొరత వెంటాడుతోంది. ప్రస్తుతం అడవులలో పొనికి చెట్ల సంఖ్య తగ్గిపోతుండడం, ప్రత్యేకంగా ప్లాంటేషన్ చేపట్టకపోతున్న కారణంగా కలప కొరత ఏర్పడుతోంది. కేవలం ఒకటి రెండు టింబర్ డిపోలలో మాత్రమే పొనికి కలప నిలువలున్నాయి. కొద్ది రోజుల క్రితం ఉపాధి హామీ పథకం కింద నిర్మల్‌లోని పలు చోట్ల పొనికి ప్లాంటేషన్ చేపట్టినప్పటికీ వాటి పెంపకం ఇప్పట్లో పూర్తి కాదంటున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పొనికి ప్లాంటేషన్‌ను మరింత విస్తృతంగా చేపట్టినట్లయితేనే ఈ కలపకు కొరత తీరుతుందని చెబుతున్నారు.

ప్రధాని మోదీ హామీ అమలు కావాలి



కొయ్య బొమ్మల పరిశ్రమను ఆదుకుంటామని ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ఇచ్చిన హామీ వెంటనే అమలు కావాలి. ప్రధాని కొయ్య బొమ్మల పరిశ్రమను ప్రోత్సహించేందుకు కొత్త పాలసీ రూపొందిస్తామన్నారు. వెంటనే ఆ పాలసీని రూపొందించాలి. ప్రధాని హామీ తమ కళాకారుల జీవితాల్లో కొత్త ఆశలు నింపింది. ఇప్పటికే ఉపాధి లేక, బొమ్మలకు సరైన మార్కెట్ లేక తాము నష్టాల పాలవుతున్నాము. పరిశ్రమను ముందుకు నడపడం కష్టమవుతుంది. ప్రధానమంత్రి ప్రత్యేక ప్రోత్సాహకాలు అందజేస్తారని ఆశిస్తున్నాము.

బ్రహ్మరౌతు పెంటయ్య వర్మ, కొయ్య బొమ్మల కళాకారుడు, నిర్మల్

ప్రధానికి రుణపడి ఉంటాం



సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్న నిర్మల్ కొయ్య బొమ్మల పరిశ్రమను ఆదుకుంటామంటూ ప్రధాని నరేంద్రమోదీ ఇచ్చిన హామీ తమ కళాకారుల జీవితాల్లో ఆశలు నింపింది. ఆయనకు జీవితాంతం కళాకారుల కుటుంబాలన్నీ రుణపడి ఉంటాయి. ఇచ్చిన హామీ మేరకు వెంటనే పరిశ్రమ రక్షణకు చర్యలు మొదలు కావాలి.

- రాచర్ల శ్రీనివాస్ వర్మ, కొయ్య బొమ్మల కళాకారుడు, నిర్మల్

గద్దెకు చేరుకున్న సమ్మక్క దేవత

మొక్కులు తీర్చుకున్న భక్తులు



గద్దె పైకి వచ్చిన సమ్మక్క దేవత

ముథోల్, ఫిబ్రవరి 22 : మండలంలోని ఎడ్‌బిడ్ తండాలో గల గుట్టలో వెలిసిన శ్రీ సమ్మక్క సారలమ్మ జాతర రెండవ రోజైన గురువారం గద్దె పైకి సమ్మక్క దేవత వచ్చింది. దీంతో వనదేవతలకు భక్తులు మొక్కులు చెల్లించేందుకు తరలివచ్చారు. బాజభజంత్రీల మధ్య బోనాలు ఒడి బియ్యం తీసుకువచ్చి శ్రీ సమ్మక్క సారలమ్మ దేవతలకు సమర్పించారు. మొక్కిన మొక్కులు నెరవేరాలని భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి నిలువెత్తు బంగారం (బెల్లం) వన దేవతలకు సమర్పించారు.

అలరించిన కుస్తీ పోటీలు



కుభీర్, ఫిబ్రవరి 22 : మండలంలోని రంజిని గ్రామంలో గురువారం నిర్వహించిన కుస్తీ పోటీలు పలువురిని అలరించాయి. ప్రతి సంవత్సరం మహాలక్ష్మీ ఆలయం వార్షికోత్సవ సందర్భంగా జాతర నిర్వహించి చివరి రోజు కుస్తీ పోటీలను నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. ఈ పోటీలకు మండలంలోని గ్రామాలతో పాటు పొరుగున ఉన్న మహారాష్ట్ర నుంచి మల్లయోధులు భారీగా వచ్చి పోటీల్లో తల బడ్డారు. మొదటి విజేతకు రూ. 5001 నగదును అందజేశారు. ఈ కార్యక్రమానికి ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామరావుపాటిల్ పాల్గొని మహాలక్ష్మీ ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకొని కుస్తీ పోటీలను వీక్షించారు. ఈ కార్యక్రమంలో నాయకులు సాప్లీ రమేష్, కందూర్ చిన్నసాయినాథ్, పంతుల దేవేందర్, గులాబ్‌నాయక్, ఎంపీటీసీ హన్మండ్లు, సాహెబ్‌రావు గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.



ఘనంగా గజ్జలమ్మ కల్యాణం

కుంటాల, ఫిబ్రవరి, 22 : మండల కేంద్రం కుంటాల గజ్జలమ్మ ఆలయ వార్షికోత్సవంలో భాగంగా రెండవ రోజు కళ్యాణమహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఉదయం నిత్యనిధి యజ్ఞ కార్యక్రమం నిర్వహించిన అనంతరం గజ్జలమ్మ కళ్యాణం నిర్వహించి అనంతరం రథోత్సవం, హారతి మంత్రపుష్పం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

పిప్రిలో శివపార్వతుల కల్యాణం

లోకేశ్వరం, ఫిబ్రవరి 22 : మండలంలోని పిప్రి గ్రామ శివాలయంలో రెండవ వార్షికోత్సవం సందర్భంగా గురువారం శివపార్వతుల కళ్యాణం వేద పండితుల మధ్య కమనీయంగా సాగింది. మొదట శివ పార్వతుల శోభాయాత్ర గ్రామంలోని ప్రధాన వీధుల గుండా సాగింది. గ్రామంలోని మహిళలు మంగళహారతులతో పెద్ద ఎత్తున హాజరయ్యారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ అనిల్, మాజీ సర్పంచ్ సాయన్న, గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు భూమి పూజ

ఖానాపూర్, ఫిబ్రవరి 22 : మండలంలోని పాత ఎల్లాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలో గురువారం పలు అభివృద్ధి పనులకు కాంగ్రెస్ నాయకులు భూమి పూజ నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు ఆదేశాల మేరకు పాత ఎల్లాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలో సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ నిర్వహించినట్లు కాంగ్రెస్ పార్టీ ఖానాపూర్ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ రాజుర సత్యం తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు నిమ్మల రమేష్, తాజా మాజీ సర్పంచ్ చంద్రయ్య, మాజీ వైస్ ఎంపీపీ తోట సత్యం, నాయకులు రవి, రాజేశ్వర్, రాజు, రాజేందర్, వేణు, తదితరులున్నారు.

పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా సహకరించాలి

రాజకీయ పార్టీ ప్రతినిధులతో కలెక్టర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

నిర్మల్ కల్చరల్, ఫిబ్రవరి 22 : రాబోయే పార్లమెంట్ ఎన్నికలు జిల్లాలో ప్రశాంతంగా జరిగేలా రాజకీయ పార్టీలు సహకరించాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ కోరారు. గురువారం ఎన్నికల నిర్వహణపై వివిధ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఎన్నికల నిర్వహణ కోసం 1564 బ్యాలెట్ యూనిట్లు, 1067 కంట్రోల్ యూనిట్లు, 1322 వీవీ ప్యాట్లు మొదటి విడత తనిఖీలను పూర్తి చేశామన్నారు. జాబితాలను పార్టీ ప్రతినిధులకు అందజేశామన్నారు. ఈ నెల 26న జిల్లాకు అదనంగా కేటాయించిన ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల తనిఖీలు చేపట్టనున్నట్లు చెప్పారు. రాజకీయ పార్టీలు ఈ తనిఖీలకు హాజరు కావాలన్నారు. ఓటరు తుది జాబితా ఈ నెల 8న ప్రచురించామని తెలిపారు. జిల్లాలోని నిర్మల్, ఖానాపూర్, ముథోల్ నియోజకవర్గాల్లో 922 పోలింగ్ కేంద్రాల్లో 3,79,880 మహిళలు, 3,53,786 మంది పురుషులు, 51 ఇతర ఓటర్లున్నారని వివరించారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఫారం- 6 పూర్తి చేసి ఓటర్లుగా నమోదు చేసుకోవాలని సూచించారు. సమగ్ర ఓటరు జాబితా రూపొందించేందుకు పార్టీలు సహకరించాలన్నారు. ఓటరు జాబితా క్షేత్ర స్థాయిలో పరిశీలించి నకిలీ, మరణించిన వారి పేర్లు తొలగిస్తామన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, ఆర్డీవో రత్న కళ్యాణి, పర్యవేక్షకుడు శ్రీనివాస్‌తో పాటు పలు రాజకీయ పార్టీ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఇంటి పన్ను వసూలు 29 లోగా పూర్తి చేయాలి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

నిర్మల్ కల్చరల్, ఫిబ్రవరి 22 : నిర్మల్ పట్టణ మున్సిపాలిటీ పరిధిలో ఇంటి పన్ను వసూళ్లు ఈ నెల 29 లోపు వంద శాతం పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ అధికారులను ఆదేశించారు. గురువారం నిర్మల్ మున్సిపల్ సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. జిల్లాలోని ఖానాపూర్, భైంసా, నిర్మల్ మున్సిపాలిటీల్లోని ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు, దుకాణ సముదాయాల ఇంటి పన్నుల వసూళ్లపై దృష్టిసారించి లక్ష్యం నెరవేర్చాలన్నారు. చెల్లించని యాజమాన్యాలకు 29 తరువాత నోటీసులు జారీ చేసి సీజ్ చేయాలని సూచించారు. కమిషనర్లు సీవీఎస్ రాజు, వెంకటేశ్వర్ రావు, మనోహర్, అధికారుల, సిబ్బంది పాల్గొన్నారు.

మేడారం జాతరతో బస్సుల కోసం ప్రయాణికుల పాట్లు



భైంసా బస్టాండ్‌లో దృశ్యం

భైంసా, ఫిబ్రవరి 22 : జిల్లాలోని రెండు డిపోల పరిధిలోని అధిక శాతం బస్సులు మేడారం జాతరకు పంపడంతో ఇక్కడి ప్రయాణీకులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వారం రోజుల పాటు వివిధ మార్గాల్లోని బస్సు సర్వీసులను రద్దు పరచి సమ్మక్క సారలమ్మ జాతరకు మళ్లించారు. ఈ నేపథ్యంలో బస్సులు రద్దు చేయబడ్డ రూట్లలోని ప్రయాణీకులు రాకపోకల చేపట్టే విషయంలో అవస్థలు పడుతున్నారు. బస్సులు ఎప్పుడు వస్తాయో వెలతాయో తెలియక ప్రయాణీకులు బస్టాండ్‌లలో నిరీక్షించాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. ఆర్టీసీ అధికారులు రద్దు చేయబడ్డ రూట్ల వివరాలను ముందుగా ప్రయాణీకులకు తెలియచెప్పకపోవడం మూలంగా సమస్యలు ఏర్పడుతున్నాయి. భైంసా బస్టాండ్ నుంచి నుంచి నిత్యం 100కు పైగా బస్సుల రాకపోకలు జరుగుతుండేవి. ఇందులో భైంసా డిపో బస్సులతో పాటు నిజామాబాద్, నిర్మల్ డిపో బస్సులు ఉన్నాయి. సంబంధిత డిపోలన్నింటి నుంచి బస్సులు మేడారం జాతరకు పంపించడంతో అర్ధశాతం బస్సుల రాకపోకలు తగ్గిపోయాయి. నిత్యం బస్సులతో సందడిగా ఉండే భైంసా బస్టాండ్ ప్రస్తుతం వెలవెలబోయి కనిపిస్తోంది. మరో మూడు రోజుల పాటు ఇదే పరిస్థితి ఉండనుందని ఆర్టీసీ వర్గాలు పేర్కొన్నాయి.

రామాలయ అభివృద్ధికి కృషి : డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు

నిర్మల్ చైన్‌గేట్, ఫిబ్రవరి 22 : జామ్ గ్రామంలోని రామాలయ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని డీసీసీ అధ్యక్షులు శ్రీహరిరావు అన్నారు. గురువారం జామ్ రామాలయ ప్రాణ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని పురస్కరించుకొని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పూజారులు ఆయనకు పూర్ణకుంభంతో స్వాగతం పలికి స్వామివారి ప్రసాదాన్ని అందించారు. అనంతరం ఆలయ విశిష్టతను పూజారి, ఊరి పెద్దలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం శ్రీహరి రావును జామ్ గ్రామ కాంగ్రెస్ కార్యకర్తలు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు బొల్లోజి నర్సయ్య, అబ్దుల్ ఆది, తెడ్డు మహేందర్, గడ్డల మహేష్, పాల శ్రీనివాస్, మేదరి లస్మన్నతో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.



సంక్షిప్త సమాచారం

ప్రేమపేరుతో బాలికను వేధించిన నేరస్తుడికి ఏడాది జైలు

నిర్మల్ కల్చరల్, ఫిబ్రవరి 22 : నిర్మల్ పట్టణం శాంతినగర్‌కు చెందిన కొండలవాడ్ బాబా షాదుల్లా (20) తొమ్మిదేళ్ల బాలికను ప్రేమ పేరుతో వేధించి పెళ్లి చేసుకుంటానని లేకుంటే చంపుతానని బెదిరించినందున అతనికి ఏడాది జైలుశిక్షతో పాటు వెయ్యి రూపాయల జరిమానా విధిస్తూ జిల్లా పోక్సో కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి ఏ.కర్ణకుమార్ తీర్పు నిచ్చారు. ఈ విషయాన్ని కోర్టు సమన్వయ అధికారి సక్రియా నాయక్ ఒక ప్రకటనలో వివరించారు. బాలిక పాఠశాలకు వెళ్తుండగా నేరస్తుడు వెంటపడి వేధించేవాడన్నారు. బాలిక తండ్రిని సైతం పెళ్లికి అడ్డువస్తే చంపేస్తానని బెదిరించాడని తెలిపారు. ఈ సంఘటన 15 ఫిబ్రవరి 2018లో చోటుచేసుకుందన్నారు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని పోలీసులు దర్యాప్తు జరిపి నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ వై.రమణారావు 11 మంది సాక్షులను విచారించగా నేరం రుజువైందని ఈ మేరకు తీర్పు వెలువడినట్లు వివరించారు.

సీజ్ చేసిన ఇసుక దొంగిలించిన వ్యక్తిపై కేసు

ఖానాపూర్, ఫిబ్రవరి 22 : మండలంలోని ఎర్వచింతల్ గ్రామంలో ప్రభుత్వ అధికారులు సీజ్ చేసిన ఇసుక డంపు నుండి ఇసుక దొంగిలించిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఖానాపూర్ ఎస్సై లింబాద్రి తెలిపారు. ఈ మేరకు గురువారం రాత్రి ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎర్వచింతల్ వద్ద సీజ్ చేసిన ఇసుక డంపుల వద్ద కాపలాగా ఉన్న వీఆర్ఏ జాడి గంగన్న ఇచ్చిన ఫిర్యాదు మేరకు పాత ఎల్లాపూర్ గ్రామానికి చెందిన నగేష్ అనే వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. దొంగిలించిన ఇసుక విలువ రూ. 2 వేల వరకు ఉంటుందని ఎస్సై పేర్కొన్నారు.

తొమ్మిది మంది పేకాట రాయుళ్ల అరెస్టు

ఖానాపూర్, ఫిబ్రవరి 22 : మండలంలోని రంగాపేట్ గ్రామ శివారులో పేకాడుతున్న 9 మంది పేకాట రాయుళ్లను అరెస్టు చేసినట్లు ఎస్సై లింబాద్రి తెలిపారు. ఈ మేరకు గురువారం రాత్రి ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. గ్రామ శివారు ప్రాంతంలో కొంతమంది పేకాడుతున్నట్లు పోలీసులకు అందిన రహస్య సమాచారం మేరకు పేకాట స్థావరంపై దాడులు నిర్వహించినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ దాడుల్లో 9 మందిని పట్టుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. రూ. 9,200ల నగదును, 52 పేకాట ముక్కల్ని సీజ్ చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

నేడు పెన్షనర్లకు ఉచిత కంటి పరీక్షలు

నిర్మల్ కల్చరల్, ఫిబ్రవరి 22 : పెన్షనర్లు, వారి కుటుంబ సభ్యులకు శుక్రవారం పెన్షనర్ల సంఘ భవనంలో ఉచిత కంటి పరీక్షలు ఉదయం 10:30 గంటలకు నిర్వహిస్తున్నట్లు అధ్యక్షుడు ఎంసీ లింగన్న ఒక ప్రకటనలో తెలిపారు. గ్లోబల్ ఆసుపత్రి వైద్యులు అందించే సేవలు ఉపయోగించుకోవాలని కోరారు.

వైద్యాధికారి పోస్టుకు దరఖాస్తు చేయండి

భైంసా బస్తీ దవాఖానాలో వైద్యాధికారి పోస్టు ఒప్పంద ప్రాతిపదికన భర్తీ చేసేందుకు వైద్య, ఆరోగ్య శాఖ నిర్ణయించిందని జిల్లా అధికారి డాక్టర్ ధనరాజ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల ఎంబీబీఎస్ అర్హులు నేటి నుంచి 26లోగా వైద్యాధికారి కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు ఫారం వెబ్‌సైట్‌లో డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు.